# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 09 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు జంగిటి లచ్చవ్వ (95) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం మరణించారు. 1948లో బైరాన్‌పల్లి కేంద్రంగా రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో జంగిటి లచ్చవ్వ చేసిన వీరోచిత పోరాటాన్ని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. లచ్చవ్వకు ఇద్దరు కుమారులు, ఇద్దర కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతిపట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

### సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలకు

# ప్రభుత్వ భూములను గుర్తించాలి

- జిల్లాకు 150 ఎకరాలు - రాష్ట్రవ్యాప్తంగా 4వేల ఎకరాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మహిళా స్వయం సమృద్ధి సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు కేటాయించిన వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ భూములను గుర్తించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క కలెక్టర్లను ఆదేశించారు. ఒక మెగావాట్ సోలార్ విద్యు దుత్పత్తికి నాలుగు ఎకరాల భూమి అవసరమనీ, ప్రతిజిల్లాలో కనీసం 150 ఎకరాలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4వేల ఎకరాలను సేకరించాలని చెప్పారు. ఎస్‌హెచ్‌జీల గుర్తింపు, టెండర్ల ఖరారు, బ్యాంకు రుణాలు వంటి అన్ని కార్యక లాపాలను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించా రు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివద్ధి శాఖల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ఉదయం ప్రజాభవన్‌లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఎస్‌హెచ్‌జీలకు సోలార్ పవర్ ప్లాంట్ల కేటాయింపుపై ఇప్పటికే ఇంధనశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య గత ఏడాది నవంబర్ 19న ఒప్పందం కుదిరిందనీ, దాన్ని వెంటనే అమల్లోకి తేవాలని చెప్పారు. ఐదేండ్లలో మహిళలను కోటీశ్వరుల్ని చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందనీ, అందుకోసం వారికి పెద్ద ఎత్తున వడ్డీలేని రుణాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆ సొమ్ముతో మహిళా స్వయం సమృద్ధి సంఘాలు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి, వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనికోసం టీజీరెడ్కో సంస్థ ఇప్పటికే టెండర్లు పిలిచిందనీ, త్వరలో వాటిని ఓపెన్ చేసి, ఖరారు చేస్తామన్నారు. ప్రధానంగా దేవాదాయ, ఇరిగేషన్ శాఖల ఆధీనంలోని భూములను గుర్తించాలని చెప్పారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ, స్తంభాలు వేసి విద్యుత్ లైన్ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. కలెక్టర్లు ఆ దిశగా పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బ్రతుకుతారని చెప్పారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందనీ, పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం కూడా అధికారులు భూముల్ని సేకరించాలని ఆదేశించారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా, ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని వివరించారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలన్నింటినీ సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించేలా గిరిజన శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గుట్టలతో విస్తరించిన భూములు అత్యధికంగా ఉన్నాయనీ, వాటి పైన సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్రంలోని పీఎమ్ కుసుమ్ పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడిందనీ, ఆ దిశగా వారిని చైతన్యం చేయాలని చెప్పారు. టీజీ రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజనులకు భూమి లభ్యత ఎక్కువగా ఉన్నా, ఆదాయం తక్కువగా వస్తున్నదనీ, అందువల్ల అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు ప్రత్యేక దృష్టిపెడితే వారికి ప్రయోజనం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణ భాస్కర్, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# తిరుపతిలో పెను విషాదం



- తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ జారీ కేంద్రాల వద్ద తోపులాట..
- ఆరుగురు మృతి
- తిరుమలలో ఈ నెల 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనాలు
- టోకెన్ జారీ కేంద్రాల వద్దకు పోటెత్తిన భక్తులు
- మృతుల్లో ఐదుగురు మహిళలు
- ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

బలగం టీవి, తిరుపతి

తిరుపతిలో తిరుమల వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీలో అపశృతి చోటు చేసుకుంది. వైకుంఠ దర్శన టికెట్ల కోసం భక్తులు ఎగబడడంతో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారు. తిరుపతిలోని శ్రీనివాసం, బైరాగిపట్టెడ, సత్యనారాయణపురం వద్ద ఉన్న టోకెన్ జారీ కేంద్రాల వద్ద భక్తుల మధ్య భారీగా తోపులాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. తిరుపతిలోని రుయా, స్విమ్స్ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రుయాలో నలుగురు, స్విమ్స్ ఆస్పత్రిలో ఇద్దరు భక్తులు చనిపోయారు. మొత్తం ఐదుగురు మహిళా భక్తులు సహా ఆరుగురు మృతి చెందారు. మృతులలో ఒకరిని తమిళనాడు సేలంకు చెందిన మహిళగా గుర్తించారు.

గురువారం ఉదయం 5గంటలకు జారీచేసే వైకుంఠ ద్వారదర్శనం టోకెన్ల కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో సిబ్బంది ముందుగా భక్తులను రోడ్లపై గుమికూడకుండా పార్కులో ఉంచారు. అనంతరం పద్మావతి పార్కు నుంచి భక్తులను క్యూలైన్లలోకి వదిలారు. ఈ సమయంలో ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుంది. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో తోపులాట జరిగిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విష్ణునివాసం, బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్?తో పాటు, సత్యనారాయణపురంలోని టోకెన్ల జారీ కేంద్రం వద్ద కూడా తోపులాట జరిగింది. ఇక్కడ పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10,11, 12 తేదీల్లో వైకుంఠద్వార సర్వదర్శనం కోసం, టోకెన్ల జారీని టీటీడీ గురువారం ఉదయం నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. రోజుకు 40 వేల చొప్పున 3 రోజుల్లో లక్షా 20వేల టోకెన్లు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేస్తామని టీటీడీ ప్రకటించగా, బుధవారం సాయంత్రం నుంచే భక్తులు బారులు తీరారు. రద్దీ ఎక్కువ కావడంతో తోపులాటకు దారితీసింది. ఈ ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీటీడీ అధికారులను అడిగి పరిస్థితి తెలుసుకున్నారు. గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. అలాగే భక్తులు మరణించిన వార్త తీవ్రంగా కలచివేసిందనీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. . వారి మృతికి సంతాపం తెలియజేస్తూమృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా అని పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి కోసం తిరుపతిలోని 9 ప్రాంతాల్లో 90 కౌంటర్ల ద్వారా సర్వదర్శన టోకెన్ల జారీకి టీటీడీ ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి టోకెన్ల జారీ ప్రారంభించాల్సి ఉండగా రద్దీ నేపథ్యంలో వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించారు. భక్తులు భారీగా తరలిరావడంతో టోకెన్ల జారీ ప్రారంభించామని టీటీడీ ఈవో తెలిపారు.


తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. , గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నాననీ తన ఎక్స్ ఖాతా లో పోస్ట్ చేసారు..

## 'గేమ్ ఛేంజర్' టికెట్ రేట్ల పెంపునకు అనుమతి

బలగం టీవి, హైదరాబాద్

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్– శంకర్ కాంబోలో తెరకెక్కిన 'గేమ్‌ఛేంజర్' సినిమా టికెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనవరి 10న సింగిల్ స్క్రీన్స్‌లో అదనంగా రూ.100, మల్టీప్లెక్సుల్లో రూ.150 పెంచుకునేందుకు వీలు కల్పించింది. ఇక జనవరి 11 నుంచి 19 వరకు 5 షోలకు సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50, మల్టీప్లెక్సుల్లో రూ.100 పెంచుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. కానీ, ప్రీమియర్ షోకు మాత్రం ప్రభుత్వం నిరాకరించింది.

తెలంగాణలో ఇటీవల సంధ్య థియేటర్ ఘటనతో సీఎం రేవంత్ రెడ్డి టికెట్ రేట్లు పెంచమని, బెనిఫిట్ షోలకు పర్మిషన్ ఇవ్వమని చెప్పిన సంగతి తెలిసిందే. అయితే నిర్మాత, తెలంగాణ ఎఫ్ డీ సీ చై.ర్మన్ దిల్ రాజు గేమ్ ఛేంజర్ టికెట్ రేట్ల కోసం సీఎంని కలిశారు. దీంతో టికెట్ రేట్లు పెంచుతూ పర్మిషన్ ఇచ్చారు. అయితే గేమ్ ఛేంజర్ సినిమాకు అర్ధరాత్రి 1 గంటకు బెనిఫిట్ షో అడగ్గా దాన్ని మాత్రం రిజెక్ట్ చేసారు. జనవరి 10న మొదటి రోజు ఉదయం 4 నుంచి ఆరు షోలకు పర్మిషన్ ఇచ్చారు. డాకు మహారాజ సినిమాకు తెలంగాణలో టికెట్ రేట్ల పెంపు అవసర్లేదని నిర్మాత నాగవంశీ అన్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు టికెట్ రేట్ల పెంపు అడగలేదు



### కేటీఆర్ వెంట

# న్యాయవాదికి అనుమతి

- వీడియో, ఆడియో రికార్డింగ్ కు అనుమతించని హైకోర్టు
- ఏసీబీ కార్యాలయంలోని లైబ్రరీలో లాయర్ కూర్చోవాలని సూచన
- ఏమైనా అనుమానాలుంటే మళ్లీ పిటిషన్ వేయాలన్న కోర్టు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా ఈ–కార్ కేసుకు సంబంధించి ఏసీబీ విచారణకు తనతో పాటు లాయర్ ను తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. అయితే, కేటీఆర్ విచారణను వీడియో, ఆడియో రికార్డు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోరగా... దీనికి హైకోర్టు నిరాకరించింది. లాయర్ తో కలిసి రేపు ఏసీబీ విచారణకు వెళ్లాలని కేటీఆర్ కు సూచించింది. ఆ తర్వాత ఏమైనా అనుమానాలు ఉంటే మళ్లీ హైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. తనతో పాటు లాయర్ ను తీసుకెళ్లేందుకు అనుమతించాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ ను విచారించింది హైకోర్టు.

గతంలో సీబీఐ దర్యాప్తు కేసులో విచారణ అధికారిపై ఎంపీ అవినాష్ రెడ్డి ఆరోపణలు చేశారని, తన వాంగ్మూలాన్ని పూర్తిగా నమోదు చేయడం లేదని, ఆడియో, వీడియో రికార్డింగ్‌ను ఆదేశించినట్లు కేటీఆర్ తరపు న్యాయవాది ప్రభాకర్ రావు కోర్టుకు తెలిపారు. ఏసీబీ దర్యాప్తుపైన కూడా అనుమానాలున్నాయని అన్నారు. లగచర్ల దాడి ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మరో కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలాలను దర్యాప్తు అధికారులు రాజకీయ ఒత్తిడి కారణంగా తారుమారు చేసినట్లు కోర్టుకు వివరించారు. వాదనలను విన్న ధర్మాసనం ే విచారణకు న్యాయవాదితో కేటీఆర్ ఏసీబీ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, హైకోర్టు కొన్ని షరతులు విధించింది. విచారణ గదిలో కేటీఆర్, విచారణ అధికారులు మాత్రమే ఉంటారని... వారితో పాటు లాయర్ కూర్చోవడానికి కుదరదని హైకోర్టు స్పష్టం చేసింది. ఏసీబీ కార్యాలయంలోని లైబ్రరీ గదిలో లాయర్ కూర్చోవచ్చని తెలిపింది. లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని హైకోర్టుకు అడిషనల్ అడ్వొకేట్ జనరల్ తెలిపారు. దీంతో, లైబ్రరీలో లాయర్ కూర్చోవాలని హైకోర్టు సూచించింది.

## విచారణకు బీఎల్ఎన్ రెడ్డి, అరవింద్ కుమార్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా ఈ కార్ రేసు కేసులో పరిణామాలు శరవేగంగా చోటుచేసుకుంటున్నాయి. కేసులో ఏ2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్ బుధవారం బంజారా హిల్స్ లోని ఏసీబీ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన ఎంఏ అండ్ యూడీ శాఖలో స్పెషల్ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు.

మరోవైపు ఇదే కేసులో మనీ లాండరింగ్, ఫెమా నిబంధనలను ఉల్లంఘించారనే అభియోగాల నేపథ్యంలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని విచారణకు హాజరు కావాలని ఈడీ ఇటీవలే నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారంఆయన ఈడీ అధికారుల ఎదుట ఫార్ములా ఈ–రేసుకు సంబంధించి కీలక పత్రాలతో విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ రేసు 2 అగ్రిమెంట్ సమయంలో డబ్బు బదిలీలో బీఎల్ఎన్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లుగా ఈడీ అధికారులు ఇప్పటికే గుర్తించారు.

### మే 1 నుంచి

# కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించింది. ఖాళీల మేరకు నోటిఫికేషన్లు జారీపై ఏప్రిల్ నెలలో కసరత్తు చేస్తామని పేర్కొంది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6–8 నెలల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారమే ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. అభ్యర్థులెవరూ ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. నిరుద్యోగులకు టీజీపీఎస్సీపై నమ్మకం కలిగేలా పనిచేస్తున్నామని బుర్రా వెంకటేశం చెప్పారు. మరోవైపు, జనవరి 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్లు ఛైర్మన్ వెంకటేశం తెలిపారు.




# ఈ అక్రమ కేసు ఇబ్బంది కానేకాదు



- కేసీఆర్ రక్తం పంచుకున్న కొడుకుని.. ఈ అక్రమ కేసుకు భయపడతానా!
- ప్రభుత్వం రైతన్నలను మోసం చేస్తున్న తీరుపైన ప్రజా క్షేత్రంలో ఎండగడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఫార్ములా ఈ–కారు వ్యవహారంలో పెట్టిన కేసు ఓ లొట్టపీసు కేసు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పొలిటికల్ మోటివేటెడ్ కేసను.. ఈ కేసుకు తాను భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఏ విచారణను ఎదుర్కోవడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు తెలంగాణ భవన్‌లో పార్టీ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఏసీబీ కేసుకు సంబంధించి మాట్లాడుతూ ఈ కేసుతో తనకేదో ఇబ్బంది వస్తుందని అందరూ అనుకుంటున్నారని.. తనకు వచ్చిన ఇబ్బందేమీ లేదని అన్నారు. పాతికేళ్ల కిందట కేసీఆర్ పార్టీ పెట్టిన రోజున ఉండే ఇబ్బందులతో పోల్చితే.. ఇది అసలు ఇబ్బందే కాదని అన్నారు. 'అదో లొట్టపీసు కేసు.. వాడొక లొట్టపీసు ముఖ్యమంత్రి.. పీకేది ఏం లేదు' అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఆనాడు కడుపు మాడ్చుకొని తెలంగాణ కోసం పోరాడారని గుర్తు చేశారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ జైత్రయాత్రనో.. కేసీఆర్ శవయాత్రనో అని కూర్చున్న ఇబ్బంది ముందు ఇది ఏమాత్రం ఇబ్బంది కాదని అన్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి ఉద్యమకారులు, ఓయూ జేఏసీ నేతలు బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో పాటు పలువురి విద్యార్థి నేతల వీపులు విమానం మోత మోగాయని గుర్తు చేశారు. యాదయ్య, శ్రీకాంతాచారి ఒంటి మీద పెట్రోల్ పోసుకుని ఆత్మార్పణ చేసుకున్నారన్నారు. వారి త్యాగాల ముందు, ఆ ఇబ్బందుల ముందు ఇది ఏ మాత్రం ఇబ్బంది కాదని చెప్పారు. గులాబీ పార్టీ పురుడు పోసుకున్న సమయంలో మజిల్ పవర్, మీడియా పవర్ లేదని అన్నారు. తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసి చావునోట్లో తలపెట్టిన కేసీఆర్ లాంటి నాయకుడు తయారు చేసిన సైనికుడిగా.. కేసీఆర్ రక్తం పంచుకుపుట్టిన బిడ్డగా ఇది తనకు ఏమాత్రం ఇబ్బంది కానేకాదన్నారు.

భారత పౌరుడిగా చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే పౌరుడిగా అధికారాన్ని అడ్డం పెట్టుకొని రేవంత్ రెడ్డి పెడుతున్న అక్రమ కేసులను రాజ్యాంగపరంగా, న్యాయపరంగా ఎదుర్కొనేందుకు తనకున్న ప్రతి హక్కును వినియోగించుకుంటానని చెప్పారు. హైకోర్టులో కేవలం క్వాష్ పిటిషన్ మాత్రమే కొట్టేశారని.. దానికే కాంగ్రెస్ నాయకులు చాలా సంతోషపడుతున్నారని.. దానికేదో ఉరిశిక్ష వేసినట్టు నేరారోపణ జరిగినట్టు సంకలు గుద్దుకుంటున్నారని ఫైరయ్యారు.

## తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లు బంద్..

- రూ.900 కోట్ల బకాయిలు ఉన్నాయని కంపెనీ వెల్లడి
- మందుబాబులకు షాక్..

వివరాలు 2వ పేజీలో

## త్వరలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తిస్థాయిలో త్వరలో ప్రారంభిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్లలో పిఎసిఎస్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి సొంత నిధులు రూ.45 లక్షలతో నిర్మిం చిన నూతన భవనం ప్రారంభోత్సవం, రూ.24 కోట్లతో ముడిమ్యాల వయా రావులపల్లి, మేడిపల్లి, పొద్దటూర్ వరకు పిఆర్ రోడ్డును ఆర్‌అండ్‌బి రోడ్డుగా మారుస్తూ రెండు వరసల నిర్మాణానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంఎల్ఏ కాలె యాదయ్య, మాజీ ఎపి రంజిత్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో అప్పా నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు అన్ని హంగులు, నాణ్యతతో నిర్మాణం కానుందన్నారు. అవసరమైతే పదే పదే క్షేత్రస్థాయిలో ఇక్కడి వస్తానని, వారం పదిరోజులకు ఒకమారు రోడ్డు నిర్మాణం పనులపై సమీక్ష చేస్తానని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గం హైదరాబాద్‌కు సమీపంలో ఉందని, పంచాయతీ, ఆర్‌అండ్‌బి రోడ్ల నిర్మాణం, విస్తరణ జరగాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఎంఎల్ఏ, ఎంపి, విప్ తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్లు అన్నింటినీ మంజూరు చేస్తానని తెలిపారు. జిల్లాలోని పిఆర్, అర్‌అండ్‌బి రోడ్లకు రూ.1000 కోట్లు కేటాయింపజేస్తానని తెలిపారు. చేవెళ్ల పిఎసిఎస్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తనకు అత్యంత ఆత్మీయుడని, నిస్వార్థం, సేవాభావం గల రాజకీయ నేత, పెద్ద మనస్సుతో స్వంత నిధులు రూ.45 లక్షలతో పిఎసిఎస్ నూతన భవనం నిర్మాణం చేయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌సి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పిసిసి కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి గౌరీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలను గాలికొదిలేశారు

బలగం టీవి, హైదరాబాద్



తెలంగాణలో సంక్షేమ పథకాలను గాలికొదిలేశారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రైతులను, మహిళలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని దుయ్యబట్టారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక ఏడాది పాలనలోనే రూ.1.37 లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. కేసీఆర్ కిట్ వస్తలేదు.. రైతు భరోసా లేదు.. రూ.4 వేల పింఛన్ ఇస్తలేరు.. మరి, రాష్ట్ర ఆదాయం, తెచ్చిన అప్పులు ఎక్కడికి పోయాయని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. సంక్షేమ పథకాలకు పైసలు లేవు.. ఫ్యూచర్ సిటీ, మెట్రోకు ఎక్కడి నుంచి వస్తాయిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయట్లేదని ధ్వజమెత్తారు. వానాకాలం రైతుబంధు కూడా ఇవ్వట్లేదన్నారు. ఏపీలో పెంచిన పింఛన్‌లు అమలు చేస్తున్నారని.. కానీ తెలంగాణలో మాత్రం అమలు చేయడం లేదని మాజీ మంత్రి విమర్శించారు.

# గ్రూప్-3 ప్రాథమిక కీ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రూప్-3 పరీక్షకు సంబంధించి టీజీపీఎస్సీ కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ పరీక్షకు సంబంధించిన కీని టీజీపీఎస్సీ బుధవారం సాయంత్రం విడుదల చేసింది. అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లో అందుబాటులో ప్రాథమిక కీని ఉంచినట్లు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు గ్రూప్-3 కీ అందుబాటులో ఉండనుంది. ఇక అభ్యంతరాలను ఆంగ్ల భాషలోనే తెలపాలని అధికారులు సూచించారు. నవంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు కేవలం 50 శాతం మంది మాత్రమే హాజరయ్యారు.

# నటి హనీరోజ్‌కు వేధింపులు.. వ్యాపారవేత్త అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**



నందమూరి బాలకృష్ణ నటించిన వీర సింహారెడ్డి సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన మలయాళ నటి హనీరోజ్‌పై ఓ వ్యాపారవేత్త వేధింపులకు పాల్పడ్డారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ హనీరోజ్ ఆదివారం కేరళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దాదాపు 30 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తాజాగా ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూరును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వయనాడ్‌లో అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

# ఆప్‌కు టీఎంసీ మద్దతు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఢిల్లీల ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మద్దతిచ్చింది. ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిచ్చిన టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ఎప్పుడూ కూడా ఆప్‌కు మద్దతుగా ఉన్నారని కొనియాడారు. అరవింద్ కేజ్రీవాల్ మేరకు బుధవారం ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు టీఎంసీ మద్దతు ప్రకటించింది. మమతా దీదీకి నేను వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. ధన్యవాదాలు దీదీ. మా మంచి, చెడు సమయాల్లో మీరు ఎల్లప్పుడూ మాకు మద్దతు ఇచ్చారు. మమల్ని ఆశీర్వదించారు' అని పేర్కొన్నారు.

# టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. టీపీబీవో ఉద్యోగాలకు ఎంపికైన 171 మంది అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. టీపీబీవో ఉద్యోగాలకు 2023 జులైలో టీజీపీఎస్సీ రాతపరీక్షలు నిర్వహించింది.

# తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లు బంద్..

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలు బంద్ కానున్నాయి. ఈ మేరకు తెలంగాణకు తమ బీర్లను సప్లయ్ చేయబోమంటూ యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తేల్చి చెప్పింది. ఈ మేరకు బుధవారం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. బీర్ల ధరలను సవరించకపోవడంతో పాటు.. పాత బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయంతో.. తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరా నిలిచిపోనుంది. సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 30కి ప్రకారం.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కి తమ బీర్ సరఫరాను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తన లేఖలో పేర్కొంది. టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని.. దీని కారణంగా రాష్ట్రంలో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. అలాగే.. బీర్ల సరఫరాకు సంబంధించి తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చాలా బకాయి పడిందని.. ఆ బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీ తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఈ కారణంగా టీజీబీసీఎల్‌కి బీర్లను సరఫరా చేయడం సాధ్యం కాదని, ఇక నుంచి బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ తన లేఖలో స్పష్టం చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని యూబీఎల్ విజ్ఞప్తి చేసింది.

**అనేక ప్రశ్నలకు తావిస్తోందని : మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు**

తెలంగాణకు కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ తీసుకున్న నిర్ణయం అనేక ప్రశ్నలకు తావిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ బకాయిలు చెల్లించలేదని యూబీఎల్ పేర్కొంది. బీర్ల విక్రయాలు నిలిపివేస్తే ప్రీమియం బ్రాండ్లు కింగ్ ఫిషర్, హీనెకెన్‌కు అంతరాయం కలుగుతుంది. స్థానిక బ్రాండ్లు బూమ్ బూబ్ బీర్, బిర్యానీ బీర్ల ప్రోత్సాహానికి చేస్తున్న ప్రయత్నమా..? బిల్లుల చెల్లింపులో ప్రత్యేక ప్రాధాన్యతల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం సీనియారిటీ ఆధారంగా బిల్లులను క్లియర్ చేసేది అని హరీశ్‌రావు గుర్తు చేశారు.



# ఇస్రో కొత్త చీఫ్‌గా వి.నారాయణన్

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కొత్త ఛైర్మన్‌గా డాక్టర్ వి.నారాయణన్ నియమితులయ్యారు. ప్రస్తుతం సంస్థకు నాయకత్వం వహిస్తున్న ఎస్.సోమనాథ్ నుంచి జనవరి 14న నారాయణన్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ నిర్ణయించింది. వి.నారాయణన్ ఇస్రోలో నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన ఇస్రో పదవిలో రెండేళ్లపాటు ఉంటారు. ప్రస్తుతం ఆయన ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ)కు నేతృత్వం వహిస్తున్నారు. రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ చోదక వ్యవస్థల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. ఇస్రోకు చెందిన జీఎస్ఎల్‌వీ మార్క్-2, 3 వాహకనౌకల రూపకల్పనలోనూ కీలకభూమిక పోషించారు. ఆదిత్య-ఎల్1, చంద్రయాన్-2, చంద్రయాన్-3లోని చోదక వ్యవస్థల అభివృద్ధికి కూడా ఆయన కృషి చేశారు. నారాయణన్ స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంకుతో ఎంటెక్ పూర్తి చేశారు. 2001లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

## ఏపీ 2.5 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి తోడ్పాటు అందిస్తాం

- **ప్రధాని మోడీ**

**బలగం టీవీ, హైదరాబాద్**



2047 నాటికి ఏపీ 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి తోడ్పాటు అందిస్తామని ప్రధాని మోడీ అన్నారు. విశాఖ సభలో ప్రధాని నరేంద్ర మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. ఇక్కడి సింహాచల వరాహ నరసింహస్వామికి ప్రణామాలు ఆచరిస్తున్నానని తెలిపారు. ఏపీ ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్టు వెల్లడించారు. తాను మూడోసారి ప్రధానిగా ఎన్నికవడంలో ఏపీ ప్రజలు చూపించి ప్రేమాభిమానాలు మరువలేనని అన్నారు. "ఇవాళ ఆంధ్ర ప్రజల స్వాగతం, ఆశీర్వాదాలు చూశాను. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాల సాధనకు మద్దతుగా నిలుస్తాను. ఏపీ అభివృద్ధితో దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. 2047 నాటికి ఏపీ 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి తోడ్పాటు అందిస్తాం. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం భుజం భుజం కలిపి నడుస్తుంది. అందుకే లక్షల కోట్ల విలువైన పథకాలతో ఏపీపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించింది. నేడు రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేర్చుతాయి. ఏపీ ప్రజల సృజ నాత్మకత వల్ల రాష్ట్రం ఐటీ, టెక్నాలజీకి ఒక పెద్ద కేంద్రంగా మారింది. ఏపీకి ఇప్పుడు సమయం వచ్చింది. సరికొత్త టెక్నాలజీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్రబిందువుగా మారాలి. 2030 నాటికి ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ను మనదేశంలో ఉత్పత్తి చేయాలి అనేది మా లక్ష్యం. అందుకోసం ప్రారంభ దశలోనే రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్ లను తీసుకువస్తున్నాం. అందులో ఒకటి మన విశాఖ ప్రాంతంలో వస్తోంది. భవిష్యత్తులో విశాఖ నగరం ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసే నగరంగా నిలుస్తుంది. ఈ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా అనేక ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఏపీలో మాన్యుఫ్యాక్చరింగ్ వ్యవస్థ కూడా అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే 7 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. అమృత్ భారత్ కింద ఏపీలోని 70కి పైగా రైల్వే స్టేషన్లను ఆధునీకకరిస్తున్నాం. విశాఖ తీరం వందల ఏళ్లుగా ఎగుమతులు, దిగుమతుల్లో ప్రధాన పాత్ర పోషిస్తోంది. సాగర సంబంధింత అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా అభివృద్ధికి బాటలు వేసుకోవచ్చు. వికసిత్ ఆంధ్రకు కేంద్రం సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రధాని మోదీ విశాఖ సభ ద్వారా భరోసా ఇచ్చారు.

# ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

- **గ్రామీణ యువత జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి..**
- **ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**




పోలీస్ శాఖకు యువతకు సత్సంబంధాలు మెరుగుపర్చులనే ఉద్దేశ్యంతో రుద్రంగి మండలం మానాల గ్రామంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలిబాల్ పోటీలలో క్రీడాకారులు మెరుగ్గైన ప్రతిభ కనబరుస్తూ జిల్లా,జాతీయ స్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.బుధవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రుద్రంగి మండలం మనాల గ్రామంలో వాలిబాల్ టోర్నమెంట్ ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్,తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలసి ప్రారంభించినారు.ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ శాఖ అనగానే శాంతి భద్రతల పరిరక్షణ ఒక్కటే తప్ప ఇతరత్రా సమస్యలు దూరంగా ఉంటుందనే అనే ముద్ర నుండి సామాజిక రుగ్మతలు రూపుమముతూ ఏదైనా సమస్యలు తలెత్తుతే మేము ఉన్నాం అంటూ శాంతి భద్రతలను సమర్ధవంతగా నిర్వహిస్తూనే ప్రజలకు, యువతకు పోలీస్ సేవలు మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో విన్నూత కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు.

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో డ్రైవింగ్ వచ్చి డ్రైవింగ్ లైసెన్స్ లేని లైసెన్స్ లు అందజేయలనే ఉద్దేశ్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మేళా నిర్వహించి గతంలో 100 మంది యువతి యువకులకు లైసెన్స్ అందజేయడం జరిగిందని రెండవ దశలో సుమారు 700 వరకు లైసెన్స్ లు అందిచేలా ప్రణాళిక రూపొందించడం అభినందనియమన్నారు.

యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చెస్తూ,జిల్లాలో పోలీస్ శాఖ గంజాయిపై ఉక్కుపాదం మోపుతు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వ్యక్తులను సన్మార్గంలో నడిపించడానికి జిల్లా కేంద్రంలో డి ఆడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు..

గ్రామీణ ప్రాంతా యువత జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని, ఏఆటలోనైనా గెలుపు,ఓటమి అనేది సహజం కాని చివరి వరకు పోరాడాలి అన్నారు.ప్రతి ఒక్కరిలో టీమ్ స్పిరిట్ ఉండలని అపుడే విజయం మన చెంతకి చేరితుందని అని అన్నారు.యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా నైపున్యాభివృద్ధి చేసుకొని చదువు ,క్రీడలపై దృష్టి సారించాలన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ...జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న మానాల గ్రామాన్ని తరచు సందర్శించడం జరుగుతుందని, ఇటీవల కాలంలో మానాల చుట్టూ ప్రక్కల ఉన్న గ్రామాల ప్రజలకు ఉచిత వైద్యా శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని,అంతే కాక యువతకు పోలీస్ సేవలు చేరువ చేయాలని, యువత చెడు వ్యాసనాల వైపు దారి మల్లకుండా యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ, స్పోర్ట్స్ మీట్ వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. యువత గంజాయి వంటి మాధకద్రవ్యాల దూరంగా ఉండాలన్నారు. మానాల గ్రామంలో ఏర్పటు చేసిన మండల స్థాయి వాలిబాల్ పోటీలలో 13 జట్లు పాల్గొననున్నాయి అని వీరికి పోటీల అనంతరం గెలుపొందిన జట్లకు బహమతులు అందజేయాడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ .చందుర్తి సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు అశోక్,అంజయ్య, క్రీడాకారులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా మహా శివరాత్రి జాతర నిర్వహించాలి

- భక్తుల నుంచి ఒక్క ఫిర్యాదు రాకుండా ఏర్పాట్లు చేయాలి..
- పారిశుధ్య నిర్వహణ ను అత్యంత ప్రాధాన్యతగా భావించాలి
- ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు జాతర నిర్వహణ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

మహాశివరాత్రి జాతర ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఓ పెన్ స్లాబ్ లో ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలసి నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు.

ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు 3 రోజుల పాటు మహా శివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా వేములవాడలో నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, కళ్యాణ కట్ట, ధర్మ గుండం, బద్ది పోచమ్మ ఆలయం, హెల్ప్ సెంటర్ , సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే జాతర ఆధ్యాత్మికంగా, దైవికంగా నిబంధనలు పాటిస్తూ, ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా నిర్వహించాలని అన్నారు. ఫిబ్రవరి 26 న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడలో ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు 3 రోజుల పాటు మాహా జాతర ను వైభవోపేతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు.

రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించాలని, గత మహా శివరాత్రి ఉత్సవాలకు 2 లక్షల 50 వేల మంది భక్తులు వచ్చారని, ప్రస్తుత సంవత్సరం 4 లక్షల కంటే ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆ స్థాయిలో మనం జాతర ఏర్పాట్లు చేయాలని అన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు నీడ, త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, జాతర సందర్భంగా పక్కన మున్సిపాలిటీలు, గ్రామాల నుంచి కార్మికులను డిప్యూట్ చేసుకొని జోన్ల వారీగా విభజించే పారిశుధ్య పక్కగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ ప్యాకెట్లు, పాలు అందించేలా దేవస్థాన సంస్థ ఏర్పాట్లు చేయాలని అన్నారు. క్యూ లైన్లలో చేరిన భక్తులకు దర్శనం కోసం అధిక సమయం పట్టే నేపథ్యంలో వారికి పాలు అందించేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని అన్నారు.

క్యూలైన్లలో వచ్చే భక్తులకు ప్రధాన ఆలయం ఎంటర్ కాకముందే అవసరమైన మేర టాయిలెట్స్ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని, టాయిలెట్స్ దగ్గర ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది కేటాయించి ప్రతి 15 నిమిషాలకు శుభ్రం చేసే విధంగా చూడాలని అన్నారు. శివరాత్రి జాతరకు ఏ ఒక్క భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగడానికి వీలు లేదని, ఈ బాధ్యతను మనమంతా తీసుకోవాలని అన్నారు. శివరాత్రి సందర్భంగా దేవాలయానికి వచ్చే విఐపి లను ప్రత్యేక లైన్ లో తీసుకొని వెళ్ళాలని, ధర్మ గుండం వద్ద గజ ఈత గాళ్లను ఏర్పాటు చేయాలని, అక్కడ నీరు రెగ్యులర్ గా చేంజ్ చేస్తు ఉండాలని,భక్తులకు వీలైనంత తక్కువ సమయంలో రాజన్న దర్శనం జరిగేలా ఏర్పాట్లు ఉండాలని అన్నారు.

జాతర కు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని,భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన నేపథ్యంలో ఫోన్ సిగ్నల్స్ సమస్య దృష్టిలో ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్, జియో మొదలగు ఆపరేటర్లతో చర్చించి తాత్కాలిక టవర్ల ఏర్పాటు చేయాలని అన్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా ఫిబ్రవరి 25 నుంచి ఫిబ్రవరి 27 వరకు వేములవాడ కు గతం కంటే 30% అధికంగా బస్సు సర్వీసులు నడపాలని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటి కప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రోడ్లలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలనిఅన్నారు . వేములవాడలో ఆలయానికి సమీపంలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, పొలాలను రైతుల సంపూర్ణ సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, వేములవాడ పట్టణానికి వచ్చే అన్ని ప్రధాన రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జాతర విధులు నిర్వహించడానికి వచ్చే సిబ్బందికి, మహాశివరాత్రి జాతర సందర్భంగా వచ్చే ముఖ్య అతిథులకు, వి.వి.ఐ.పి, వి.ఐ.పి లకు వసతి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని, ప్రతి పందిరి దగ్గర అవసరమైన భద్రత కల్పించాలని అన్నారు.

జాతర సందర్భంగా వచ్చే భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చల్లి వేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కాకుండా మూడు షిఫ్ట్ లో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ళ వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలనిఅన్నారు . మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అదనపు కళ్యాణ కట్టలు ఏర్పాటు చేయాలని, బద్ది పోచమ్మ ఆలయం , నాంపెల్లి ఆలయం వద్ద అదనపు క్యూ లైన్లు సిద్ధం చేయాలని, అవసరమైన భద్రత కల్పించాలని, విద్యుత్ అలంకరణ పనులు ఆకర్షణీయంగా చేపట్టాలనిఅన్నారు . ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్ ,జగిత్యాల రోడ్డు, పార్కింగ్ దగ్గర అవసరమైన హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలని అన్నారు. మహా జాతర జరిగే సందర్భంగా మద్యం అమ్మకాలను వేములవాడ పరిసరాలలో నిషేధించాలని అన్నారు.

మహాశివరాత్రి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని దానికోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. మహా భారతం, శివ పురాణం మొదలగు భక్తి పర్యంతమైన కార్యక్రమాలు జరిగేలా చూడాలని, జాతరను పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు . ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రసాదం కౌంటర్ లు మరిన్ని చోట్ల పెట్టాలని,గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, అక్కడ పోలీసుల కోసం టెంట్, త్రాగు నీటి సరఫరా ఉండాలని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద రోడ్డు ఆక్రమణలు కాకుండా డ్రైవ్ పెట్టాలని అన్నారు. తిప్పాపూర్ చౌరస్తా దగ్గర సాయంత్రం ఉండే మార్కెట్,జాతర సమయంలో ఉండకుండా ముందస్తు సమాచారం సంబంధిత వ్యాపారులకు అందజేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

వేములవాడ ఆలయం ప్రధాన అర్చకులు భీమ శంకర శర్మ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతర సందర్భంగా ఫిబ్రవరి 25, 2025 న ప్రభుత్వం, రాత్రి 7 గంటల 30 నిమిషాలకు పట్టు వస్త్రాల సమర్పణ, తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుందని, ఫిబ్రవరి 26,2025 తెల్ల వారుజామున 12 గంటల నుంచి 2.30 గంటల వరకు పుర జనులకు సర్వదర్శనం, తెల్లవారు జామున 2.30 గంటల నుంచి ఉదయం 3.30 గంటల వరకు ప్రజా ప్రతినిధులు స్థానిక అధికారులకు దర్శనం, ఉదయం 3.30 నుంచి 3.40 గంటల వరకు మంగళ వాయిద్యంలో ప్రదర్శన, ఉదయం 3.40 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాతం సేవ మరియు ఆలయ శుద్ధి, ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు ప్రాతకాల పూజ/అనువంశిక అర్చకుల దర్శనం ఉంటుందని తెలిపారు.

మహాశివరాత్రి ఫిబ్రవరి 26, 2025 , సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మహా లింగార్చన (స్వామివారి కల్యాణ మండపంలో) అనువంశిక బ్రాహ్మణోత్తముల దర్శనం , రాత్రి 11.35 నిమిషాలకు లింగోద్భావ కాలం నందు శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వాక ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ శేషాద్రి రెడ్డి, ఈఓ వినోద్ రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రజా ప్రతినిధులు సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ తయారీ కేంద్రం తనిఖీ..



**బలగం టీవీ , వేములవాడ**

శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ బుధవారం తనిఖీ చేశారు. మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశం అనంతరం విప్, కలెక్టర్, ఎస్పీ తదితరులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ ఈవో వినోద్ రెడ్డి శాలువాలతో సన్మానించి, స్వామి వారి ప్రసాదాన్ని అందజేయగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు.

అనంతరం విప్ అది శ్రీనివాస్,కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తదితరులు లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్టోర్ రూం, లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలు, నెయ్యి, తయారీ విధానం, పరిసరాలు తనిఖీ చేశారు. రోజు ఎంత నెయ్యి వినియోగిస్తున్నారు, ఎన్ని లడ్డూలు రోజు సిద్ధం చేస్తారు? ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారో ఆరా తీశారు. లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని పూర్తిగా ఆధునీకరించాలని, భక్తుల సంఖ్యకు అనుగుణంగా ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నాణ్యత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.





## బైకు అదుపుతప్పి యువకుడి మృతి

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని శివారులో మండేపల్లి గ్రామానికి చెందిన సురుకాని మని తేజ (23) అనే వ్యక్తి మంగళవారం రాత్రి సుమారు ఏడు గంటల ప్రాంతంలో తన బైకు టీఎస్ 17 జి 99 84 గల హెచ్ఎఫ్ డీలక్స్ బండిపై పని నిమిత్తం తన ఇంటి నుండి తంగళ్ళపల్లి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.మృతునికి భార్య రాధిక, 2 సంవత్సరాల కొడుకు రిశీవర్ధన్ ఉన్నారు. మృతుని భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామని తెలిపారు.

# యష్ 'టాక్సిక్' గ్లింప్స్ విడుదల



**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ స్టార్ నటుడు యష్ టాక్సిక్ అనే క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించిన విషయం తెలిసిందే. 'ఎ ఫెయిరీ టెల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. నేషనల్ అవార్డు విన్నర్ మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే నేడు యష్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి స్పెషల్ గ్లింప్స్ వదిలారు మేకర్స్.

టాక్సిక్ బర్త్‌డే పీక్ అంటూ వదిలిన ఈ వీడియోలో యష్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. సిగార్ కాల్చుకుంటూ యష్ కాసినోలోకి రాయల్‌గా ఎంట్రీ ఇస్తూ ఉండడం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వీడియోను మీరు కూడా చూసేయండి. మరోవైపు ఈ సినిమాను కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు మేకర్స్.

# 'గేమ్ ఛేంజర్' నుంచి జాతర సాంగ్




**బలగం టీవీ, హైదరాబాద్**

దిగ్గజ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటంచిన చిత్రం గేమ్ ఛేంజర్. ఈ చిత్రం రేపు విడుదల కానుంది. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి జాతర సాంగ్ కొండ దేవర పాటను విడుదల చేశారు మేకర్స్. 'నెత్తురంతా ఉడుకుతున్న ఊరువాడ జాతర' అంటూ సాగే పవర్ ఫుల్ లిరిక్స్‌ను కాసర్ల శ్యామ్ అందించగా.. తమన్, శ్రావణ భార్గవి దీన్ని ఆలపించారు.

# శర్వానంద్ కోసం నందమూరి, కొణిదెల హీరోలు..

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడు శర్వానంద్ 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు దర్శకత్వంలో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటిస్తున్నారు. వారిలో ఒకరు సంయుక్త కాగా మరొకరు సాక్షి వైద్య. ఇప్పటికే ఈ సినిమా నుంచి శర్వానంద్ తో పాటు సాక్షి వైద్య ఫస్ట్ లుక్స్ రిలీజ్ అయ్యాయి. తాజాగా ఈ మూవీ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ టైటిల్ లాంచ్ కోసం నందమూరి హీరోతో పాటు కొణిదెల హీరో ముఖ్య అతిథులుగా రానున్నట్లు చిత్రబృందం తెలిపింది. అయితే వారెవరు అనేది తెలియాలంటే జనవరి 14 వరకు వెయిట్ చేయాల్సిందే.ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

# హైందవ గ్లింప్స్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




శ్రీ మహా విష్ణువు దశావతారాలు కథాంశంతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా 'హైందవ' సినిమా రాబోతోంది. ఈ మూవీలో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. లుధీర్ బైరెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ చందు నిర్మాత. లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. మూవీ మేకర్స్ ఈరోజు మూవీ గ్లింప్స్ రిలీజ్‌తో పాటు, టైటిల్ కూడా అనౌన్స్ చేశారు. 2.40 నిమిషాలు ఉన్న హైందవ గ్లింప్స్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఓ అడవిలో దశావతారాలకు నెలవైన పురాతన ఆలయం ఉంటుంది. దశావతారాల్లో మత్స్య, కూర్మం, వరాహ, నరసింహ, వామన, పరశురాముడు, శ్రీరాముడు, బలరాముడు, శ్రీకృష్ణుడు, కల్కి అవతారాలు ఉంటాయి. ఈ ఆలయాన్ని కొందరు దుండగలు నాశనం చేయడానికి ప్రయత్నిస్తారు. వారిని అడ్డుకోవడానికి ఓ బైకులో హీరో సాయి శ్రీనివాస్ వస్తుంటాడు. దుండగులు గుడికి నిప్పు పెట్టగానే చేపలు, వరాహం, సింహం, గద్ద వంటివి స్పందిస్తాయి. సింహం, వరాహం, గద్ద కూడా హీరో బైకు వెంట ప్రయాణిస్తున్న విజువల్ అద్భుతంగా ఉంటుంది. చివరికి హీరో దుండగులను అడ్డుకుని గుడిని రక్షిస్తాడు.. టీజర్‌లో విజువల్స్, గ్రాఫిక్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అద్భుతంగా ఉన్నాయి. రాముడు, కృష్ణుని కీర్తనలను కలిగి ఉన్న లియోన్ జేమ్స్ మ్యూజిక్ సీన్స్‌ని చక్కగా ఎలివేట్ చేసింది. ఇప్పటికే సినిమా 30 శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. పాన్– ఇండియా స్థాయిలో సినిమాని విడుదల చేయనున్నారు.

# 'రాచరికం' ట్రైలర్‌ను విడుదల చేసిన మారుతి




**బలగం టీవీ, హైదరాబాద్**

అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'రాచరికం'. ఈశ్వర్ నిర్మాతగా చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఈ మూవీని నిర్మించారు. సురేశ్ లంకలపల్లి, ఈశ్వర్ వాసె ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన కంటెంట్, పాటలు, పోస్టర్లతో అందరిలోనూ అంచనాలను పెంచేసింది. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను స్టార్ డైరెక్టర్ మారుతి రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ మూవీ ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ కనించిన తీరు, డిఫరెంట్ లుక్స్, నటించిన విధానం చాలా కొత్తగా ఉంది. విలేజ్ పొలిటికల్ రివేంజ్ డ్రామాగా రాబోతున్నట్లు ఈ మూవీ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.

"రాచకొండ ఒక అడవి లాంటిదబ్బా.. ఈడ బలంతో పోరాడే పులులు, బలగంతో పోరాడే ఏనుగులు, ఎత్తుకు పై ఎత్తు వేసే గుంట నక్కలు, కాసుకుని కాటేసే విష సర్పాలు ఉంటాయి.. వాటి మధ్య జరిగే పోరులో రక్త పాతాలే తప్ప రక్త సంబంధాలు ఉండవు" అంటూ సాగిన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టకునే విధంగా ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ వేంగి, ఆర్య సాయి కృష్ణ కెమెరా వర్క్, రామ్ ప్రసాద్ మాటలు ఈ ట్రైలర్‌కి ప్లస్ అయ్యాయి.సినిమాను ఫిబ్రవరి 1న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.




# టాప్ 10లోకి రిషబ్ పంత్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ లేటెస్ట్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బ్యాటింగ్‌లో టీమిండియా బ్యాటర్ రిషభ్ పంత్ (739 రేటింగ్స్?) మూడు స్థానాలు మెరుగుపర్చుకుకొని టాప్ 10లోకి దూసుకొచ్చాడు. అలాగే టీమ్ఇండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో ఆగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. 908 రేటింగ్స్‌తో బుమ్రా టాప్‌లో కొనసాగుతున్నాడు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 841 రేటింగ్స్‌తో రెండో స్థానం దక్కించుకున్నాడు. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్ ఏకంగా 29 స్థానాలు ఎగబాకాడు. అతడు 745 రేటింగ్స్‌తో రవీంద్ర జడేజాతో కలిసి తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. ఇక భారత్ నుంచి బుమ్రా, జడేజా మాత్రమే టాప్ 10లో కొనసాగుతున్నారు.





# రిటైర్మెంట్ ప్రకటించిన మార్టిన్ గప్టిల్

**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ కు న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్ మార్టిన్ గప్టిల రిటైర్మెంట్ ప్రకటించడం జరిగింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా అధికారిక ప్రకటన చేశాడు మార్టిన్ గప్టిల్. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు గప్టిల్ పేర్కొన్నాడు. తన కెరీర్‌లో మద్దతుగా నిలిచిన కివీస్ క్రికెట్ బోర్డు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, కుటుంబ సభ్యులు, అభిమానులకు గప్టిల్ థాంక్స్ చెప్పాడు

38 సంవత్సరాల మార్టిన్ గప్టిల్ తన అంతర్జాతీయ క్రికెట్ లో న్యూజిలాండ్ జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. ఇప్పటివరకు 198 వన్డేలు మార్టిన్ గప్టిల్ ఆడాడు. అలాగే ఇప్పటి వరకు 122 టి20 మ్యాచ్ లు ఆడాడు ఈ స్టార్ క్రికెటర్. అలాగే నలభై ఏడు టెస్టులు ఆడడం జరిగింది. మొత్తం ఈ మూడు ఫార్మాట్లలో కలిపి 13,463 పరుగులు చేశాడు మార్టిన్ గప్టిల్. ఇందులో 23 సెంచరీలు కూడా ఉండడం గమనార్హం. న్యూజిలాండ్ తరఫున వన్డేల్లో అత్యధిక స్కోర్ చేసిన రికార్డ్ గప్టిల్ పేరిటే ఉంది. 2015 వరల్డ్‌కపలో గప్టిల్ వెస్టిండీస్‌పై డబుల్ సెంచరీ సాధించాడు. ఆ మ్యాచ్‌లో 237 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.





# 'గేమ్ చేంజర్', 'డాకు మహారాజ్' ఏపీ హైకోర్టు షాక్

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'గేమ్ చేంజర్', నందమూరి బాలకృష్ణ 'డాకు మహారాజ్ సినిమాల టికెట్ ధరల్ని పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రీమియర్ షోలతో పాటు 14 రోజుల పాటు టికెట్ ధరలని పెంచుకోవడానికి పర్మిషన్ ఇస్తూ జీవో కూడా జారీ చేసింది. టికెట్ ధరలు పెంచడం వలన సంక్రాంతి ఫెస్టివల్ టైంలో సినిమాలకి భారీ కలెక్షన్స్ గ్యారెంటీ అని మేకర్స్ భావిస్తున్నారు. అయితే టికెట్ ధరల పెంపుపై దాఖలైన పిటిషన్ ను నేడు విచారించిన ఎపి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేవలం టికెట్ ధరలు పెంపు 10 రోజులకే పరిమితం చేయాలని సూచించింది. దీంతో ప్రభుత్వం హై కోర్ట్ సూచనల మేరకు జీవోలో కొన్ని మార్పులు చేయనుంది. 14 రోజుల స్థానంలో కేవలం 10 రోజులకి మాత్రమే ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇస్తూ జీవో సవరించనుంది.